

క్యాంపెయిన్‌ను ప్రారంభించిన ప్రొ. సంజయ్‌శర్మ, చిత్రంలో వర్సిటీ ఉన్నతాధికారులు, విద్యార్థులు

హెచ్‌సీయూలో 'హర్ ఘర్ తిరంగా' ఊరేగింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్‌సీయూ విద్యార్థులు, ఆచార్యులు మంగళవారం జాతీయ జెండాలను చేతబూని వర్సిటీ ప్రాంగణమంతటా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ బీజేరావు మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా' ప్రచార కార్యక్రమం ఆగస్టు 15 వరకు కొనసాగుతుందని తెలిపారు. జాతీయ జెండాను ఎగురవేసి, అధికారిక వెబ్‌సైట్ 'హర్‌ఘర్ తిరంగా'లో వారి సెల్ఫీలను అప్‌లోడ్ చేసి ఈ క్యాంపెయిన్‌లో పాల్గొనాలని విద్యార్థులకు, ఆచార్యులకు సూచించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సంజయ్ శర్మ, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో వైద్యులతో కిమ్స్ సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

తుల్సా..ప్రో ప్రక్రియతో ఆధునిక చికిత్స

● ప్రొస్టేట్ క్యాన్సర్, ప్రొస్టేట్ పెరుగుదలకు చెక్

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రొస్టేట్ క్యాన్సర్, ప్రొస్టేట్ పెరుగుదల సమస్యలకు టాన్స్ యూరేథ్రల్ అల్ట్రాసౌండ్ అబ్లేషన్ ప్రొస్టేట్ (తుల్సా.ప్రో) వంటి అత్యాధునిక పద్ధతితో చెక్ పెట్టవచ్చని కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. కిమ్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సంబిత్ సాహు, యూరాలజిస్ట్, యూరో-అంకాలజిస్ట్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ లిఖితేశ్వర్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ వై.ఎం.ప్రశాంత్‌లతో కలిసి ఆయన వివరించారు. ఇది విప్లవాత్మకమైన ఎంఆర్ఐ మార్గదర్శకత్వం కలిగిన అల్ట్రాసౌండ్ ఆధారిత చికిత్స విధానమని అన్నారు. ఈ చికిత్స ద్వారా ఎటువంటి కోతలు, కుట్లు అవసరం లేకుండా ఆస్పత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. భారతదేశంలోనే కాకుండా మొత్తం ఆగ్నేయాసియాలో ఇదే మొట్ట మొదటిగా నిలిచిందన్నారు. తుల్సా- ప్రో ముఖ్యంగా వృద్ధ రోగులకు, మధుమేహం లేదా రక్తపోటు ఉన్నవారికి, శస్త్రచికిత్స ప్రమాదం ఎక్కువగా ఉండే వారికి అత్యంత అనుకూలమైన చికిత్స అని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ మున్నా, డాక్టర్ కె.వి.ఆర్. ప్రసాద్, డాక్టర్ నీల్ నరేంద్ర త్రివేది తదితరులు హాజరయ్యారు.



పిల్లర్ వద్ద సోమవారం రాత్రి జరిపిన తవ్వకాలు

పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్‌కు ప్రమాదమేమీ లేదు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నంలో స్కైవాక్ నిర్మాణం కోసం పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వే కింది భాగంలో తవ్వకాలు జరుగుతున్నాయని, ఈ తవ్వకాలతో పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్‌కు ప్రమాదమేమీ లేదని హెచ్‌ఎండీఏ తన 'ఎక్స్' ఖాతాలో మంగళవారం రాత్రి ప్రకటించింది. స్కైవాక్ నిర్మాణం కోసం పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ వేలోని 13, 14 పిల్లర్ నంబర్ల మధ్య సోమవారం రాత్రి నుంచి తవ్వకాలు జరుగుతున్నాయి. పిల్లర్ వద్ద లోతుగా తవ్వడంతో ఫ్లైఓవర్‌కు ప్రమాదముందంటూ సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇంజనీర్ల పర్యవేక్షణలోనే పిల్లర్‌కు 2.5మీటర్ల వెడల్పు, లోతుతో తవ్వుతున్నామని హెచ్‌ఎండీఏ పేర్కొంది.

బాటసింగారం చిన్న ఏరులో.. పెద్ద వరద

● బాటసింగారం-మజీద్‌పూర్ రోడ్డులో రాకపోకలు బంద్

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహం వచ్చి బాటసింగారం వద్ద చిన్న ఏరులో చేరుతుంది. దాంతో బాటసింగారం- మజీద్‌పూర్ రోడ్డులోని ఏరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు బాటసింగారం పంచాయతీ అధికారులతో కలిసి మంగళవారం ఆ రోడ్డులో వాహనాల రాకపోకలను బంద్ చేయించారు. రోడ్డుకు అడ్డంగా స్టాపర్‌లతో పాటు కంపకంచేను ఏర్పాటు చేశారు. మరో రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలతో ముందస్తు చర్యల్లో భాగంగా రోడ్డులో రాకపోకలను నిషేధించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏరు వైపు ఎవ్వరు వెళ్లవద్దని పోలీసులు, పంచాయతీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఆలయాల్లో శ్రావణమాస ఉత్సవాలు

కొత్తపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లోని ఆలయాల్లో శ్రావణమాస ఉత్సవాలు వేడుకగా కొనసాగుతున్నాయి. మంగళవారం కొత్తపేటలోని పురాతన భక్తాంజనేయ స్వామి ఆలయం, ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ, సత్యానగర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. స్నేహపురి కాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరాలయంలో ఉదయం ప్రసన్నాంజనేయ స్వామి ఉపాలయంలో ఉత్సవమూర్తికి అభిషేకం అర్చన చేశారు. అనంతరం ఆలయం వద్ద శాస్త్రోక్తంగా మన్యు సూక్త హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరిసర కాలనీల భక్తులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లికి కుంకుమార్చన

మన్సూరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్‌లోని పోచమ్మ దేవి దేవాలయంలో మంగళవారం సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా వేడుకలకు మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు చేశారు. ఆలయ పురోహితుడు శ్రీధరాచార్యులు వేదమంత్రోచ్చరణల నడుమ ఉదయం అమ్మవారికి పంచామృత ఫలరసాభిషేకం, కుంకుమార్చన, ఇతర పూజల అనంతరం అమ్మవారి శేషవస్త్రాల వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్లు నాంపల్లి శంకరయ్య, పోచబోయిన గణేష్‌యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శులు నాంపల్లి కృష్ణ, ఎం.ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి కొప్పుల ఉపేందర్‌రెడ్డి, కోశాధికారి పాతూరి రాజేందర్‌గౌడ్, ఇతర సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ ఆటోనగర్ ఇండస్ట్రియల్, హుడాసాయినగర్, చాణక్యపురి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో నిర్వహణ పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ ఆటోనగర్ ఇండస్ట్రియల్, హుడాసాయినగర్, చాణక్యపురి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

12 రోజుల్లో 7.. 2 రోజుల్లో 4..

● మలక్‌పేటలో నమోదైన డెంగీ కేసులు

● కేసు నమోదైన ఇంటి పరిసరాల్లోని వంద ఇళ్లకు యాంటీ లార్వా స్ప్రే



అఫ్జల్‌నగర్‌లో డెంగీ పేషెంట్ కుటుంబీకులకు ముందు జాగ్రత్త చర్యలను వివరిస్తున్న డీసీ ఎంకేఐ అలీ, ఏఎంహెచ్‌వో డాక్టర్ రుద్ర శ్రీనివాస్ ఎంటమాలజీ ఏఈ శ్రీనివాస్

చాదర్‌ఘాట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలో డెంగీ కేసులు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఆగస్టు నెల ప్రారంభం నుంచి మంగళవారం వరకు ఏడు డెంగీ కేసులు నమోదైనట్లు అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సోమవారం ఒక్కరోజే మూడు కేసులు నమోదు కాగా, మంగళవారం తాజాగా మరొకటి నమోదైంది. దీంతో రెండు రోజుల్లోనే నమోదైన డెంగీ కేసుల సంఖ్య నాలుగుకు చేరింది.

మలక్‌పేట అక్బర్‌బాగ్‌లోని దయానంద్‌నగర్‌లో రెండేళ్ల బాలిక జాన్వీ డెంగీతో బాధపడుతున్నట్లు వైద్య పరీక్షల ద్వారా బయటపడింది. నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ప్రస్తుతం బాలిక ఇంట్లోనే ఉంటూ చికిత్స పొందుతుంది. సోమవారం మలక్‌పేట అఫ్జల్‌నగర్ నివాసి ఐయాన్ (9), రాణిబాగ్ నివాసి నయీమున్నీసా (55), డబీర్‌పుర బీబీకా ఆల్వా నివాసి జైనాబ్ (28) డెంగీ బారిన పడ్డారు. వీరిలో ఐయాన్ సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా నయీమున్నీసా, జైనాబ్ మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అంతకుముందు మరో మూడు డెంగీ కేసులు నమోదయ్యాయి. డెంగీ బారిన పడిన రోగుల్లో ఏ ఒక్కరికి ప్రాణాపాయ పరిస్థితి తలెత్తలేదు.

యాంటీ లార్వా స్ప్రే...

మలక్‌పేటలో డెంగీ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 డీసీ ఎంకేఐ అలీ, ఏఎంహెచ్‌వో డాక్టర్ రుద్ర శ్రీనివాస్, ఎంటమాలజీ ఏఈ శ్రీనివాస్‌తోపాటు పారిశుధ్య విభాగం ఎస్ఎఫ్‌ఏలు, ఎస్‌ఎఫ్‌ఏలతో ఆయా కుటుంబీకులను పరామర్శించారు. ముందు జాగ్రత్త చర్యలను వివరించారు. డెంగీ కేసు నమోదైన పేషంట్ నివాసముంటున్న ఇంటి పరిసరాల్లోని వంద ఇళ్లకు యాంటీ లార్వా స్ప్రే చేయించారు. వైద్య సిబ్బందితో ఫీవర్ సర్వే చేయిస్తున్నారు.

కోహెడలో ధాన్యం నిల్వ గోదాం ప్రారంభం



గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో కోహెడలో ధాన్యం నిల్వ, క్రయ, విక్రయాల కోసం నిర్మించిన గోదాంను మంగళవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కోసం సహకార సంఘం నిర్మించిన గోదాంను సంఘం పరిధిలోని రైతులంతా ఉపయోగించుకోవాలని సూచించారు. రైతుకు గిట్టుబాటు ధర వచ్చే వరకు ధాన్యం నిల్వ చేసుకుని విక్రయించుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, పాలకవర్గం సభ్యులు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, యాదగిరి, కృష్ణారెడ్డి, కొండ్రు స్వప్న, చెక్క, లక్ష్మమ్మ, శీలం లక్ష్మమ్మ, సంఘం సీఈవో రాందాసు, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ భాస్కరచారి, నాయకులు శేఖర్‌రెడ్డి, మంకాలదాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం : ఏఐఎస్‌ఎఫ్

వనస్థలిపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏఐఎస్‌ఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు సీతారం అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఏఐఎస్‌ఎఫ్ సరూర్‌నగర్ మండల ప్రధాన కార్యదర్శి పి.వినోద్ ఆధ్వర్యంలో మంగళవారం వనస్థలిపురం డివిజన్ హస్తినాపురం చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతారం ఏఐఎస్‌ఎఫ్ జెండాను ఏగరవేసి మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏఐఎస్‌ఎఫ్ సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ జెండా ఆవిష్కరణ

చంపాపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సాగర్‌రోడ్‌లోని హస్తినాపురం సిగ్నల్ వద్ద మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు సీతారాం హాజరై ఏఐఎస్‌ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు బాదరాజు భవాని, సంతోష్, రేణుక, ఉష, సాయి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

24 మంది మద్యం ప్రియులకు కౌన్సెలింగ్

కొత్తపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 24 మంది మద్యం ప్రియులకు వారి కుటుంబసభ్యుల సమక్షంలో టీటీఐ లెక్చర్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీటీ అమరవర్ధన్‌రెడ్డి వారికి మద్యంమత్తులో వాహనాలు నడిపితే కలిగే నష్టాలను వివరించారు.

'వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి'

మన్సూరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్‌లోని వీరభద్రకాలనీలో వరదనీటి సమస్య పరిష్కారానికి నూతన పైప్‌లైన్లు వేసి శాశ్వత పరిష్కారం చూపుతామని కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షం వీరభద్రకాలనీని ముంచెత్తడంతో మంగళవారం ఆయన జలమండలి ప్రధానకార్యాలయంలో ఆ విభాగం ఈఎన్‌సీ అండ్ టెక్నికల్ డైరెక్టర్ బీఎల్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సుమారు 30 కాలనీలకు సంబంధించిన డ్రైనేజీ లైన్లతో పాటు వరదనీటి లైన్లు వీరభద్రకాలనీ గుండా మళ్లించడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పైప్ లైన్లు కుంగిపోయి కాలనీ మొత్తం డ్రైనేజీ, వరద నీటితో నిండిపోయిందన్నారు. నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ మేరకు రూ.5లక్షలతో కూడిన అంచనా వ్యయాన్ని అధికారులకు నర్సింహారెడ్డి సమర్పించగా ఇందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి విభాగం సీజీఎం నాగేంద్ర, జీఎం మహేందర్‌నాయక్, బీజేపీ నాయకులు పారంద సాయి తదితరులు ఉన్నారు.

కొట్టుకున్న అవినాష్ కాలేజీ విద్యార్థులు

● సోషల్ మీడియాలో గ్యాంగ్ వార్‌గా వైరల్

కొత్తపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ అవినాష్ కళాశాలలో ఈ నెల 1వ తేదీన సాయంత్రం క్యాంపస్‌లో ఇంటర్, డిగ్రీ విద్యార్థుల మధ్య తోపులాట, వాగ్వాదం అనంతరం బయట పెట్రోల్ బంకు వద్ద విద్యార్థులు కొట్టుకున్నారు. సోషల్ మీడియాలో మంగళవారం ఈ ఘటన ఎల్బీనగర్‌లో గ్యాంగ్ వార్ ట్యాగ్‌తో వైరల్‌గా మారింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం... ఎల్బీనగర్‌లో ఉండే ఆకాష్ అవినాష్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. అదే కాలేజీలో డిగ్రీ చదువుతున్న వంశీ, భరత్, అంకిత్ సాయి, మణికంఠ అతడి స్నేహితులు. ఈ నెల 1న సాయంత్రం తరగతుల అనంతరం క్యాంపస్‌లో ఇంటర్ విద్యార్థి ఆకాష్ డిగ్రీ విద్యార్థి ధీరజ్ మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. కాలేజీ నుంచి బయటకువచ్చిన తర్వాత కూడా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. వంశీ, భరత్, అంకిత్ సాయి, మణికంఠ కలిసి ఆకాష్ తరఫున ధీరజ్‌పైన దాడికి దిగారు. ధీరజ్ తన మామ, డ్రైవరు అయిన కిరణ్‌కు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న కిరణ్‌పైనా ఆకాష్ స్నేహితులు దాడి చేశారు. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదు. దగ్గరలో ఉన్న పోలీసులు విద్యార్థుల మధ్య గొడవను సద్దుమణిగేలా చేసి, వంశీ, భరత్, అంకిత్ సాయి, మణికంఠలను పీఎస్‌కు తరలించి, వివరాలు సేకరించారు. కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గ్యాంగ్‌వార్ కాదు: ఎస్‌హెచ్‌ఓ

డిగ్రీ విద్యార్థులైన వంశీ, భరత్, అంకిత్ సాయి, మణికంఠలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చామని ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపారు. వారికి 35(3) బీఎన్‌ఎస్‌ఎస్ నోటీసు ఇచ్చామన్నారు. అది విద్యార్థుల మధ్య చోటు చేసుకున్న స్వల్ప వివాదమని, గ్యాంగ్‌వార్ కాదని ఆయన స్పష్టం చేశారు.

హర్ ఘర్ తిరంగా..



తన ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి అంజన్, బీజేపీ నాయకులు

ఎల్బీనగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ మంగళవారం తన ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తి పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు గోవర్ధన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కుర్మగూడలో తిరంగా ర్యాలీ

సంతోష్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులు, స్థానికుల్లో దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించడానికి కుర్మగూడ డివిజన్ అధ్యక్షులు దుద్యాల యుగేందర్ నాథ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలు చేస్తూ సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, కాలనీ బస్తీవాసులు జాతీయ జెండాలను చేత పట్టుకొని చురుగ్గా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్, బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ సహదేవ్ యాదవ్, మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, దశరధలక్ష్మి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

అంబేడ్కర్ విగ్రహానికి శుద్ధి

సంతోష్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని డీఎస్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాలలు వేసిన కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి తదితరులు.

లావణ్య స్పా సెంటర్‌పై పోలీసుల దాడులు

చాదర్‌ఘాట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట్ సలీమ్‌నగర్‌లోని లావణ్య స్పా సెంటర్‌పై మంగళవారం రాత్రి సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మలక్‌పేట పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి ఆరుగురు మహిళలు ఒక యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. వారిని కేసు దర్యాప్తు నిమిత్తం మలక్‌పేట్ పోలీసులకు అప్పగించారు. గతంలోనూ ఇదే స్పా సెంటర్‌లో నిర్వాహకులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. ఘటన అనంతరం లావణ్య స్పా సెంటర్ నిర్వాహకులు పరారైనట్లు పోలీసులు తెలిపారు. మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



కొత్తపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళ(35) మృతదేహం లభ్యమైంది. ఎల్బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఫ్లై ఓవర్ పిల్లర్ నెం.24 సమీపంలో చింతలకుంట దారిలో మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడి మృతి

● మరొకరికి గాయాలు

వనస్థలిపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ రాఘవేంద్ర కాలనీకి చెందిన సూదుల వెంకటఅరుణ్(35) అతని స్నేహితుడు దంతూరి అజయ్ కలిసి సోమవారం అర్ధరాతి సమయంలో హయత్‌నగర్ నుంచి వనస్థలిపురం బైక్(ఏపీ 39 ఏటీ 5969)పై వస్తున్నారు. ఈ క్రమంలో హైకోర్టు కాలనీ కమాన్ వద్దకు రాగానే రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన లారీ(టీఎస్07యుఎన్5269)ని ఢీకొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న వెంకటఅరుణ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా, వెనుకాల కూర్చున అజయ్‌కి స్వల్పగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మంగళవారం మృతుని భార్య వెంకటరాజ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం



లబ్ధిదారుడికి సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్‌లోని షిర్డీనగర్‌కు చెందిన రాఘవేంద్రకు మంజూరైన సీఎం సహాయ నిధి రూ. 2 లక్షల విలువైన ఎల్‌ఓసీని బాధితుడు రాఘవేంద్రకు ఎమ్మెల్యే మంగళవారం అందజేశారు.

రాహుల్‌గాంధీకి వివాహ ఆహ్వానం..



రాహుల్‌గాంధీకి వివాహ హ్వానపత్రికను అందజేసిన శివచరణ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తన వివాహానికి రావాలంటూ ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు తన తండ్రి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఢిల్లీలో రాహుల్‌గాంధీని మర్యాదపూర్వకంగా కలిసిన శివచరణ్ రెడ్డి ఈ మేరకు ఆహ్వానపత్రికను అందజేశారు. కాగా ఈ నెల 17వ తేదీ ఆదివారం శంషాబాద్‌లోని జీఎంఆర్ ఆరేనాలో దివ్యరెడ్డితో జక్కిడి శివచరణ్ రెడ్డి వివాహం జరగనుంది.

కల్వర్టు వద్ద పేరుకుపోయిన చెత్త తొలగింపు

హయత్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని కల్వర్టుల వద్ద పేరుకుపోయిన చెత్తను జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి తొలగింపజేశారు. మదర్ డెయిరీ రోడ్డులోని శుభోదయనగర్ కాలనీ కల్వర్టులో పెద్ద ఎత్తున్న చెత్త పేరుకుపోవడంతో వర్షం నీరు నిలిచి కాలనీని ముంచేత్తుతోంది. దీంతో కాలనీ ప్రజలు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది ద్వారా ఎక్స్‌కవేటర్‌తో వ్యర్థాలను, చెత్తను తీయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉగాది ఎల్లప్ప, సత్యనారాయణ, కాలనీ అధ్యక్షుడు నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పవన్‌కుమార్ గృహనిర్బంధం



గృహనిర్బంధంలో కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్‌ను చైతన్యపురి పోలీసులు మంగళవారం గృహనిర్బంధం చేశారు. బంజారాహిల్స్‌లో పెద్దమ్మతల్లి ఆలయం కూల్చివేతను నిరసిస్తూ రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన కుంకుమార్చన కార్యక్రమానికి వెళ్లకుండా తనను పోలీసులు గృహనిర్బంధం చేశారని ఆయన తెలిపారు. దేవాలయాలను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వ మోసాలను ప్రజా క్షేత్రంలో ఎండగడతామని అన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

చంపాపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హస్తినాపు డివిజన్ భూపేష్ గుప్తానగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం కార్పొరేటర్ సుజాతనాయక్ విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్చన, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ తల్లి బోనాలు

హయత్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని సాయి శ్రీనివాస బాటిల్స్ కంపెనీ ఆవరణలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ బోనాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధానకార్యదర్శి, ఐవీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల స్వప్న, సాయికిరణ్ గుప్తా, సాయితేజ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలి

● సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి యాదయ్య

హయత్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో బీసీ బిల్లును ప్రవేశపెట్టి 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయించాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. మంగళవారం హయత్‌నగర్‌లో జరిగిన సర్కిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణకు నిధులు తీసుకురావడంతో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ విఫలమయ్యారని అన్నారు. కొత్త గణేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చంద్రమోహన్, సర్కిల్ కార్యదర్శి నర్సిరెడ్డి, సభ్యులు కృష్ణయ్య, కనకయ్య, మల్లేశం, భాస్కర్, కృష్ణారెడ్డి, అనీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకటేష్‌గౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు సాయికిరణ్‌గౌడ్

బీజేపీ మండల కార్యవర్గం నియామకం

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బబ్బూరి సాయికిరణ్‌గౌడ్ మంగళవారం ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా బొడిగె సురేఖ, గడ్డం ప్రకాష్‌గౌడ్, సురేష్‌ముదిరాజ్, గుండ్ల రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా ఉప్పు నవీన్, మేడిపల్లి వెంకటేష్‌గౌడ్, కార్యదర్శులుగా వేణు ప్రకాష్‌చారి, సిద్దగోని పద్మ, చెరుకు మల్లేషం, మనోహర, మూల శ్రీనివాస్, అనంతరెడ్డి, కోశాధికారిగా పెద్దింటి సుధాకర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి పాపయ్యగౌడ్, గోవర్ధన్‌గౌడ్, రమాదేవి, రంగ జంగమయ్యగౌడ్, కొండల్‌రెడ్డి, శ్రావణ్‌చారి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గువ్వల బాలరాజుకు సన్మానం



ఇటీవల బీజేపీలో చేరిన అచ్చంపేట్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కొండ్రు పురుషోత్తం మంగళవారం రాష్ట్ర కార్యాలయంలో కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. పార్టీలో చేరినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందరాజ్, మధు తదితరులు ఉన్నారు.

- హయత్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి)